క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

భూత్పూర్: రైతుబీమా కోసం ఆగస్టు5 లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన వారు, ఆన్‌లైన్‌లో తహసీల్దార్ సంతకం ఉన్న పేపర్ మీసేవ నుంచి తీసుకొని సంబంధిత ఏఈఓలను, మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఏఓ కోరారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్, రైతుబీమా దరఖాస్తు ఫాం నింపి అందజేయాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం

నవాబుపేట: అంటువ్యాధులపై అవగాహన అవసరమని తహసీల్దార్ నాన్యనాయక్, మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర అన్నారు. సోమవారం ప్రాథమిక ఆస్పత్రిలో సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్య సూత్రాలు వివరించాలని సూచించారు. సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావదినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య మాట్లాడుతూ బీటీఏ సంఘం ప్రారంభం నాటి నుంచి అంబేడ్కర్, పులే ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. గౌరవ అధ్యక్షుడు బాలపీర్, కార్యదర్శి కడం బాలశంకర్, విజయ్ కుమార్, సతయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ తగదు

నారాయణపేట: ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం తగదని టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహులు సోమవారం సంయుక్త ప్రకటనలో ఖండించారు. పిల్లల్లో మార్పు కోసం ప్రయత్నించిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు అండగా నిలవాలని అప్పుడే పూర్తి అంకిత భావంతో పనిచేస్తారని తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సస్పెండ్ చేసిన అధికారులకు తగిన సూచనలు ఇచ్చి ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణపేట: సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలో సోమవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ అందజేశారు. దామరగిద్ద మండలం కందేన్‌పల్లికి చెందిన కిష్టమ్మకు రూ.13వేలు, ధన్వాడకు చెందిన మనెమ్మకు రూ.17వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో సత్యయాదవ్, సిద్ది వెంకట్‌రాములు పాల్గొన్నారు.

వైభవంగా కొడీపీర్ల ఊరేగింపు



నర్వ: మండలంలోని లంకాల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కొడీపీర్ల పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఎంతో వైభవంగా సాగే ప్రధాన ఘట్టం హజ్రత్ మౌలాలీ పీర్ల సవారీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిర్వహించే సవారీని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. ప్రత్యేక వాయిద్యాలతో అలాయ్ ఆటను యువకులు ఆడుతూ ఆనందించారు. మహిళలు బొడ్డెమ్మలతో అలరించారు. మొక్కు బడులున్న భక్తులు పీర్లకు దట్టీలు, పూలహారాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఏటా నిర్వహించే అతి పెద్ద ఉత్సవాలకు తినుబండారాలు, పిల్లల ఆట వస్తువులు విక్రయించే వారు తమ వ్యాపారాలను కొనసాగించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జడ్చర్ల: ఓ మహిళ(56) రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల–గంగాపూర్ ప్రధాన రహదారిని సదరు మహిళ దాటుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే మహిళ ఎవరనేది తెలియలేదు.



మట్టి తొలగింపు పనులు



మట్టి తొలగింపుతో కనిపిస్తున్న కోనేరు



మెట్లబాట పునరుద్ధరణ పనులు

పెద్దగుట్టపై ముమ్మరంగా పనులు

- కోనేరు పూర్వవైభవం కోసం రాళ్ల తొలగింపు
- మెట్లమార్గం పున:రుద్ధరణ



వాహనాల పార్కింగ్ కోసం బండరాళ్ల తొలగింపు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్ద గుట్ట రంగనాయక స్వామి ఆలయంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శ్రీరంగనాయక ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ఆధ్వర్యంలో శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కోనేరు పూడ్చివేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం కోనేరులో ఉన్న బండరాళ్లు, మట్టిని జేసీబీ సాయంతో తీసివేసే పనులు కొనసాగుతున్నాయి. సోమవారం కోనేరుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముమ్మరంగా పనులు చేపట్టారు. అదేవిధంగా గుట్టపై భాగాన వచ్చే వాహనాలు పార్కింగ్‌చేసేందుకు గాను బండరాళ్లను తొలగించి చదును చేస్తున్నారు. గుట్టపైకి వెళ్లేందుకు ఉన్న మెట్ల బాటను బాగు చేయిస్తున్నారు. పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి పూజలు చేసి పనులను ప్రారంభించారు.



పనులను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

దేవాలయానికి విరాళం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయాల పునర్నిర్మాణం కోసం పట్టణానికి చెందని కూరగాయల వ్యాపారి వీరనాగురు హన్మంతు రూ. 12,116 విరాళం ప్రకటించారు. సోమవారం పూజారి నాగరాజుస్వామికి నగదు అందజేశారు.

అన్నదానం..

దేవాలయ ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివంగత హెచ్‌ఎం కొండ జగన్మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కార్యక్రమం చేపట్టారు.

నేడు అవగాహన ర్యాలీ

జడ్చర్ల టౌన్: గోనయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని నేతాజీ చౌరస్తా నుంచి క్రాస్‌రోడ్డు వరకు యాంటీ నార్కోటిక్ డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. వాకథాన్ ర్యాలీని జయప్రదం చేసేందుకు విద్యార్థులు, యువత పాల్గొనాలని సభ్యులు పిలుపునిచ్చారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి పూజలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కొండేడ్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవత ఆలయ నిర్మాణం కోసం సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీమాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య శ్రీకారం చుట్టారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు జంగయ్యమాదిగ, నాయకులు దగ్గుల బాల్‌రాజు, కరాటే శ్రీను, మల్లేష్, జంగయ్య, రాములు, యాదయ్య, వీరాస్వామి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న నాయకులు

సినారె సేవలు వెలకట్టలేనివి



సినారెకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు తదితరులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో సోమవారం డా. సి. నారాయణరెడ్డి జయంతి పురస్కరించుకుని నివాళిలు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. సాహిత్యంలో సినారె సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. తెలుగు సాహిత్యం కోసం ఎంతగానో కృషిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, అనురాగిణి విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ బోరు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఐదో వార్డు పరిధిలోని ఏనుగొండ–ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి గాను ఏర్పాటుచేసిన పవర్ బోరును సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. అంతకుముందు 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్ వీధి నం.17లో పర్యటించారు. అక్కడ రోడ్డు సరిగా లేకపోవడంతో సీసీ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కౌన్సిలర్ కె.వనజ, ఎదిర మాజీ కౌన్సిలర్ శివశంకర్, ఆయా కాలనీవాసులు రామస్వామి, అంజి, యాదయ్య, శివరాములు, ప్రవీణ్‌కుమార్, వాల నాగయ్య, భాస్కర్, రాంనరేష్, జకియాఖాన్, యాదయ్య, అఖిల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 17వ వార్డు పరిధిలోని ఎర్రవల్లి, పిల్లలమర్రితండాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాపారాయుడు, మేఘ్యానాయక్, వెంకటేష్‌నాయక్, పల్లె రాఘవ, రవి తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మాణం చేపట్టాలి

భూత్పూర్: మండలంలోని కర్వెన–చౌలతండా మధ్య ఉన్న కాల్వపై కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నామమాత్రంగానే గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టడం వల్ల ఇబ్బంది తలెత్తుతోందని చెబుతున్నారు. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధి కోసం కర్వెన గ్రామ పంచాయతీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందంటున్నారు. ఇదివరకు గ్రామ సర్పంచ్‌గా ఉన్న శ్రీను చౌలతండాలో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా రేషన్ సరఫరా చేసే వారని చెబుతున్నారు. కాగా ప్రస్తుతం సర్పంచుల పదవీ కాలం ముగియడంతో మళ్లీ కర్వెనకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. కాగా వర్షాకాలం కావడంతో కాల్వలో నీరు పారడంతో వెళ్లలేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. కర్వెన గ్రామస్తులు సైతం వివిధ పనుల నిమిత్తం బిజినేపల్లి, మంగనూరు, నాగర్‌కర్నూల్ వెళ్లాలంటే ఈ కాల్వను దాటాల్సి ఉంటుంది. కాగా వర్షం నీరు ఉంటుండడంతో కొత్త మొల్గర నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే తమ కష్టాలు తీరాలంటే కాజ్‌వే నిర్మాణం చేయాల్సిందేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



కర్వెన–చౌలతండా వెళ్లే దారిలో కాజ్‌వే నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

అసంపూర్తిగా సబ్‌సెంటర్

- వర్షాల నేపథ్యంలో పశువుల పాకగా మార్చేసిన స్థానిక రైతులు



సిద్ధాయిపల్లి వద్ద అసంపూర్తి సబ్‌సెంటర్ పరిస్థితి ఇలా..

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్ధాయిపల్లి వద్ద నిర్మిస్తున్న సబ్‌సెంటర్ నిర్మాణం పనులు అసంపూర్తిగా చేపట్టారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు దానిని పశువుల పాకగా మార్చేశారు. రాత్రి వేళల్లో పశువులను ఉంచడంతో పాటు.. వివిధ అవసరాలకు దానిని అక్కడున్న ప్రజలు వినియోగిస్తున్నారు. కాగా అమిస్తాపూర్ సబ్‌సెంటర్ మహిళ సమాఖ్య భవనంలో ఉండగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో సిద్ధాయిపల్లి వద్ద భవన నిర్మాణం చేపట్టారు. ఇదిలా ఉండగా అమిస్తాపూర్‌లో అధిక జనాభా ఉండడం, సిద్ధాయిపల్లిలో చాలా తక్కువ సంఖ్యలో జనాభా ఉండడంతో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది సైతం ఇక్కడ సబ్‌సెంటర్ ఏర్పాటుకు మొగ్గు చూపడం లేదు. అయితే అమిస్తాపూర్‌లోని పంచాయతీ భవనంలోకి సబ్‌సెంటర్ మార్పు చేస్తే ప్రజలకు అందుబాటుతో పాటు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అమిస్తాపూర్‌లోనే సబ్‌సెంటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం సిద్ధాయిపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న ఈ సబ్‌సెంటర్ భవనాన్ని వార్డు కార్యాలయంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



దేవరకద్ర: మండల కేంద్రంలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాలతో పాటు పలు వీధులలో కవాతు కొనసాగింది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు పోలీసుల రక్షణతో పాటు భరోసా ఇవ్వడానికి ఈ కవాతు నిర్వహించినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. కవాతులో డిప్యూటీ కమాండర్ భగాలీ, ఎస్‌ఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వికసించిన బ్రహ్మకమలం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సంవత్సరానికి ఒకసారి వికసించే బ్రహ్మకమలం కాలనీవాసులను కనువిందు చేస్తోంది. జిల్లా కేంద్రంలోని మోనప్ప గుట్టలోని భగాడె జ్యోతి ఇంట్లో వికసించిన బ్రహ్మ కమలాన్ని చూసేందుకు చుట్టుపక్కల వారు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా బ్రహ్మ కమలం వద్ద కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

నిఘా నీడలో క్లబ్‌రోడ్డు

- జడ్చర్లలో దాత సహకారంతో 14 సీసీ కెమెరాల ఏర్పాటు
- మరిన్ని చోట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలన్న పోలీసులు



సీసీకెమెరా ఏర్పాటుకు పూజలు చేస్తున్న రాంరెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ రోడ్డు నుంచి జాతీయరహదారి వరకు ఉన్న క్లబ్‌రోడ్డు ఇకపై సీసీ నిఘాలో ఉండనుంది. ఈ రోడ్డుపై మొత్తం 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రియల్ వ్యాపారి హుస్నాబాద్ రాంరెడ్డి అతడి సోదరుడు సూర్యప్రకాష్‌రెడ్డిల సహకారంతో రూ.2లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సీఐ ఆదిరెడ్డి ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఇటీవల దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో చర్యలు చేపట్టారు. పోలేపల్లి ఫార్మ సెజ్ వల్ల అనేక రాష్ట్రాల నుంచి పట్టణానికి వలసలు పెరుగుతున్నాయి. కాగా వీరిలో కొందరు ఉద్యోగాల పేరిట ఇక్కడ ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా బిహార్, యూపీ ప్రాంతాల వారిపై అనుమానాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు అత్యావశకంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కెమెరాల ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రాంతం అంతా సురక్షితంగా ఉంటుదని భావించామని .. అందుకే వాటి ఏర్పాటుకు ముందుకు వచ్చామని దాత హుస్నాబాద్ రాంరెడ్డి తెలిపారు. కాగా అన్ని కాలనీల్లోనూ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సీఐ ఆదిరెడ్డి సూచించారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుక



బోనమెత్తిన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్



డోలు వాయిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



బోనాలతో వస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎదిర రెవెన్యూ వార్డులో సోమవారం మైసమ్మ బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మైసమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. బోనాల వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల వేడుకల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ వేర్వేరుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ వేడుకల్లో బోనమెత్తారు. కాగా మాజీ మంత్రి డోలు వాయించారు. మాజీ కౌన్సిలర్ శివశంకర్, స్థానికులు నాని, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పనులు పూర్తిచేయరా?



పోల్కంపల్లి రోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి వరకు బీటీరోడ్డు రెన్యూవల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు ఏడాది నుంచి కంకర వేసి వదిలేశారు. బీటీరోడ్డు పనులను పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై వాహనాలు వెళ్లినప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము వస్తుండటంతో వ్యాధులకు గురవుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు కంకర ఎగిరి అద్దాలపై పడటంతో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లక్ష్మణ్‌గౌడ్, పంచాయతీరాజ్ ఏఈ, మూసాపేట, ఫోన్‌నం.. 98492 64959

వెలగని హైమాస్ట్ లైట్లు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన రహదారి నిర్వాహకులు ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. నాలుగైదు రోజులుగా చౌరస్తా వద్ద లైట్లు వెలగకపోవడంతో రోడ్డు క్రాస్ చేసే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి క్రాసింగ్ వద్ద ఆర్టీసీ బస్సులు ఊర్లోకి వచ్చి వెళ్తాయి. ఆ సమయంలో చీకటి ఉండటం వల్ల రోడ్డు క్రాసింగ్ చేసే ఇతర వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్వాహకులు హైమాస్ట్ లైట్లను బాగు చేయించకపోవడంతో వాహనదారులు చౌరస్తా వద్ద చీకట్లోనే రోడ్డు దాటుతున్నారు. దీనివల్ల ప్రమాదం పొంచి ఉంది. రహదారి నిర్వాహకులు స్పందించి లైట్లను బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.